ప్రభుత్వ వ్యతిరేకతే గెలిపిస్తుంది



కాంగ్రెస్‌లోకి రాజీవ్‌నగర్ యువకులను ఆహ్వానిస్తున్న పరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్ కాంగ్రెస్ అభ్యర్థి మందముల్ల పరమేశ్వర్‌రెడ్డి

కుషాయిగూడ: తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతే తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తుందని ఉప్పల్ కాంగ్రెస్ అభ్యర్థి మందముల్ల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రాజీవ్‌నగర్, నవోదయనగర్ కాలనీలో ఆయన ప్రచారం నిర్వహించారు. స్థానిక యువకులు, మహిళలతో సమావేశ మయ్యారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. ఎక్కడ చూసినా గుంతల రోడ్లు, రోడ్లపై పారుతున్న మురుగే కనిపిస్తోందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. చెయ్యి గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించి మీ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేదల సంక్షేమానికి పెద్దపీట వేసినట్లు తెలిపారు. ఆరు గ్యారంటీలపై అవగాహన కల్పించి ఒక్కసారి ఎమ్మెల్యేగా అవకాశం కల్పించాలన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన రాజీవ్‌నగర్ యువకులకు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు పోలేపాక అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో కాంగ్రెస్‌దే విజయం..

రామంతాపూర్: డివిజన్ పరిధిలోని కేసీఆర్‌నగర్‌లో తెలంగాణ మలిదశ ఉద్యమ కారుడు మసిముక్కల మైసయ్యయాదవ్ ఆధ్వర్యంలో అభ్యర్థి మందముల పరమేశ్వర్‌రెడ్డి సమక్షంలో భారీ సంఖ్యలో పలు బస్తీలకు చెందిన వారు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీల సంక్షేమ పథకాలకు బ్రహ్మరథం పడుతున్నారని, ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పార్టీలో చేరిన వారిలో షకీల్, అంజి, వెంకటేష్, సోహెల్, శివశంకర్, లింగం, అంజలి, సత్తెమ్మ, మాధవి, చిలుకమ్మ, ప్రియాంక, దేవి, సంధ్యతో పాటు కాంగ్రెస్ నేతలు తోఫిక్, రఫీక్, గిరిబాబు, జలీల్ పాషా తదితరులు పాల్గొన్నారు.

పరమేశ్వర్‌రెడ్డిని గెలిపిస్తేనే అభివృద్ధి

మల్లాపూర్: ఉప్పల్ ఎమ్మెల్యేగా మందముల పరమేశ్వర్‌రెడ్డిని గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తాడని కాంగ్రెస్ సీనియర్ నేత నెమలి అనిల్ కుమార్ అన్నారు. బుధవారం పరమేశ్వర్‌రెడ్డికి మద్దతుగా నెమలి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో మల్లాపూర్‌లోని చాణిక్యపురి కాలనీ, దత్తాత్రేయనగర్, శక్తి సాయినగర్, గెల్మోర్ గార్డెన్స్, సూర్యనగర్ కాలనీలో హస్తం గుర్తుకు ఓటు వేయాలని కోరుతూ ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా నెమలి అనిల్ కుమార్ మాట్లాడుతూ మల్లాపూర్ వాసులంతా కాంగ్రెస్ పార్టీ వైపు ఉన్నారన్నారు. మల్లాపూర్‌లో జన ప్రవాహం కదులుతోందని, ఎగిరేది కాంగ్రెస్ జెండా అని తెలిపారు. రాష్ట్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, ఉప్పల్ గడ్డ మీద కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని పేర్కొన్నారు. ప్రచారంలో జిల్లా ఎస్సీసెల్ సలహాదారులు పీజీ.సుదర్శన్, సుద్గుణారావు, జమీలా బేగం, మక్తాల బాలరాజ్‌గౌడ్, జోష్, నుస్రత్‌ఖాన్, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, జహంగీగౌడ్, మహేష్ నాయక్, సురేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



నవోదయనగర్‌లో మాట్లాడుతున్న పరమేశ్వర్‌రెడ్డి

జోరుగా కాంగ్రెస్ ప్రచారం

రామంతాపూర్: డివిజన్ పరిధిలోని శ్రీరామకాలనీ గాంధీనగర్, టీవీ కాలనీ, జనప్రియ కాలనీ అపార్ట్‌మెంట్, నేతాజీనగర్, ఇందిరానగర్‌లో బుధవారం కాంగ్రెస్ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల సంక్షేమ పథకాలను ప్రచారం చేస్తూ కాంగ్రెస్ పార్టీకే ఓటు వేయాలని కోరుతూ సీనియర్ నేతలు, కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. విజయ, రఫీక్, సందీప్, పూస సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న దృశ్యం



మల్లాపూర్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నేత అనిల్‌కుమార్



రామంతాపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

కార్లను కొత్తగా తీర్చిదిద్దేందుకు..

సాక్షి, సిటీబ్యూరో: అమెరికాలోని చికాగోకి చెందిన కార్ కేర్ స్టూడియో టర్టిల్ వాక్స్ నగరానికి తన సేవల్ని విస్తరించింది. నగరంలోని ఎల్బీనగర్‌లోని రాజీవ్‌గాంధీ నగర్‌లో ఏర్పాటైన ఈ స్టూడియోను మంగళవారం ప్రారంభించారు. అత్యాధునిక కార్ల రీ మోడలింగ్, కస్టమైజ్డ్ సర్వీసెస్ ఈ స్టూడియో అందిస్తుందని ఈ సందర్భంగా నిర్వాహకులు తెలిపారు.

సోనియాగాంధీ రుణం తీర్చుకుందాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

జంగ్ 2023 తెలంగాణ

మల్కాజిగిరి: కాంగ్రెస్ పార్టీని గెలిపించుకొని తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకుందామని మల్కాజిగిరి ఎమ్మెల్యే పార్టీ అభ్యర్థి మైనంపల్లి హన్మంతరావు అన్నారు. దుర్గానగర్‌లో జరిగిన కాలనీవాసుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో ఎందరో ప్రాణత్యాగాలు చేశారని, వారి త్యాగాలు వృథా కాకూడదనే సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించారన్నారు. బంగారు తెలంగాణ చేస్తానని గద్దెనెక్కిన కేసీఆర్ పది సంవత్సరాల్లో తెలంగాణకు చేసిన మేలు ఏమీ లేదన్నారు. ప్రజల పక్షాన కాంగ్రెస్ పార్టీ ఉందని, వారి సంక్షేమం కోసమే ఆరు గ్యారంటీ పథకాలను ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో జీఎస్వీ సతీష్‌కుమార్, వెంకటేష్‌యాదవ్, సంపత్‌గౌడ్, కొండలు, జలంధర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, జాలయ్య తదితరులు పాల్గొన్నారు. మల్కాజిగిరి డివిజన్ నుంచి కార్పొరేటర్‌గా పోటీ చేసిన గోగికర్ అరుణ్‌కుమార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.

మల్కాజిగిరి అసెంబ్లీకి ఆరో రోజు ఏడు నామినేషన్లు



మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్ తరఫున నామినేషన్ దాఖలు చేసిన ఆయన కుమారుడు

మల్కాజిగిరి: మల్కాజిగిరి అసెంబ్లీ స్థానానికి ఆరవ రోజు ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. మాజీ ఎమ్మెల్యే బీజేపీ నాయకుడు ఆకుల రాజేందర్ తరఫున ఆయన కుమారుడు, ప్రజా ఏక్తా పార్టీ నుంచి గద్దం పద్మజ, దేశ్ జనహిత్ పార్టీ నుంచి షేక్ ఫయాజ్ అహ్మద్, స్వతంత్ర అభ్యర్థులుగా రవికోటి మదన్ మోహన్, కందిబండ నర్సింహారావు, పీసరి విఘ్నేశ్వర్‌రెడ్డితో పాటు తెలంగాణ ప్రజా జీవన రైతు పార్టీ అభ్యర్థి చుండి శోభన్‌బాబు మరో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఇప్పటిదాకా 11 మంది నామినేషన్లు దాఖలు చేశారు. శుక్రవారంతో నామినేషన్ల గడువు ముగియనుంది.

ఇద్దరు బైండోవర్



అల్వాల్: నిబంధనలు అతిక్రమించి నేరాలకు పాల్పడిన ఇద్దరిని నేరేడ్‌మెట్ పోలీసులు మల్కాజిగిరి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాజిగిరికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, రాష్ట్ర మాజీ కార్యదర్శి బద్దం పరుశురాంరెడ్డి, వ్యాపార వేత్త బొబ్బిలి విజయ్ రెడ్డిని బైండోవర్ చేశారు. ఈ ఎన్నికల్లో మరోసారి నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

కాంగ్రెస్ వస్తే.. పేకాట క్లబ్‌లు వస్తాయి

మంత్రి హరీశ్‌రావు



చిలుకానగర్‌లో ప్రచారం చేస్తున్న బన్నాల గీతా ప్రవీణ్



మల్లాపూర్‌లో మహిళా సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు



మహిళా సమ్మేళనానికి హాజరైన మహిళలు

మల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ వస్తే మళ్లీ పేకట క్లబ్‌లు వస్తాయని, అవి వస్తే మళ్లీ మహిళలు పుస్తెలు అమ్ముకోవాల్సి వస్తుందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. కేసీఆర్ వచ్చాక హైదరాబాద్‌లో ఒక్క పేకాట క్లబ్ లేదని, అన్నింటినీ క్లోజ్ చేశారన్నారు. బుధవారం మల్లాపూర్ వీఎస్ఆర్ గార్డెన్‌లో ఉప్పల్ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డికి మద్దతుగా మహిళ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు హాజరై మాట్లాడారు. అక్కా.. చెల్లెళ్లు కొంత ఆలోచన చేయాలి, కేసీఆర్ వచ్చాక.. ఏం చేశారు..., కాంగ్రెస్ ఏం చేసిందో ఆలోచన చేయాలన్నారు. ఆనాడు నీళ్ల కోసం ఎన్ని ఇబ్బందులు పడ్డారు..., ఇవాళ కేసీఆర్ ప్రతి ఇంటింటికీ నీళ్లు ఇస్తున్నారని తెలిపారు. ఇవాళ మిషన్ భగీరథ పథకాన్ని కేంద్రం కాపీ కొట్టి హర్ ఘర్ కా జల్ అని పథకం పెట్టారని, మిషన్ భగీరథ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం స్వయంగా కొనియడారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడా మతఘర్షనలు, బంద్‌లు, కర్ఫ్యూలు లేవన్నారు. హైదరాబాద్‌లో ప్రశాంతమైన వాతవరణం ఉందని తెలిపారు. ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి, సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, శాంతి సాయిజెన్ శేఖర్, బన్నాల గీతా ప్రవీణ్, బొంతు శ్రీదేవి, సింగిరెడ్డి శ్రీరీషా తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో బీఆర్ఎస్ జెండా..

కుషాయిగూడ: ఉప్పల్ నియోజకవర్గంలో మరోసారి బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం చర్లపల్లి డివిజన్ ఈసీనగర్‌లో అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బొంతు శ్రీదేవితో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజలు, మహిళలు వారికి పూల వర్షం కురిపిస్తూ మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఐదేళ్లలో చేసిన అభివృద్ధిని వివరిస్తూ మరోమారు కారు గుర్తుకు ఓటు వేసి అభివృద్ధికి బాటలు వేసుకోవాలని బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని అభ్యర్థించారు. దప్పు గిరిబాబు, సప్పిడి శ్రీనివాస్‌రెడ్డి, నేమూరి మహేష్‌గౌడ్, ఎంకిర్యాల నర్సింహ, జౌండ్ల సత్తిరెడ్డి, బొడిగె ప్రభుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీలను నమ్మి మోసపోవద్దు

ఉప్పల్: ఓటర్లు కాంగ్రెస్, బీజేపీలను నమ్మి మోసపోవద్దని చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. బుధవారం ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డికి మద్దతుగా మల్లికార్జున్‌నగర్ కాలనీలో ఇంటింటి ప్రచారం చేశారు. కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను కోరారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరించారు.

బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు

ఉప్పల్: కేసీఆర్ నాయకత్వంలో జరిగిన అభివృద్ధిని చూసి ఆకర్షితులైన బీఎస్పీ నేత ఎడ్ల పరమేశ్వర్ ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. బహుజన సమాజ్‌వాది పార్టీ అభ్యర్థి ఉప్పల్ అసెంబ్లీ ఇన్‌చార్జి ఎడ్ల వాణి పరమేశ్వర్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాస శేఖర్ ఆధ్వర్యంలో బుధవారం పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి లక్ష్మారెడ్డిని పార్టీలోకి ఆహ్వానించారు. చిలుకానగర్ డివిజన్ నుంచి ఎడ్ల బాల్‌రెడ్డి, పిన్నపురెడ్డి మల్లారెడ్డి, పాతపల్లి శ్రీనాథ్‌రెడ్డి, పోన్నాల రామిరెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు.

అభివృద్ధి నా బాధ్యత..

మల్లాపూర్: ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధి నా బాధ్యత అని.. 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటానని ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి అన్నారు. నాచారం డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్‌తో కలిసి బండారి లక్ష్మారెడ్డి ఇంటింటి ప్రచారం చేశారు. బీఆర్ఎస్ సీనియర్ నేత నెమిలి కొండ భూపాల్‌రెడ్డి, మేకల ముత్యంరెడ్డి, అంజి, వేముల మారయ్య, మల్లికార్జున్‌గౌడ్, రాజేష్‌గౌడ్, అఖ్రూ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌లో చేరుతున్న ఉప్పల్ బీఎస్పీ అభ్యర్థి ఎడ్ల పరమేశ్వర్



నాచారం రాంరెడ్డినగర్‌లో ప్రచారంలో బండారి లక్ష్మారెడ్డి

అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో గ్రాండ్ పేరెంట్స్ డే



బోడుప్పల్: బోడుప్పల్ అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో బుధవారం పూర్వ ప్రాథమిక విద్యార్థుల గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. కార్యక్రమానికి పాఠశాల డైరెక్టర్ కౌశిక్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై వారితో తన ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల సత్ప్రవర్తన, మంచి నడవడికకు అమ్మమ్మలు, తాతయ్యలు ఇచ్చే చేయూత, చెప్పే కథలు, ఆట పాటలు, వారి అనుభవాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఆధునిక కాలంలో తల్లిదండ్రులు పిల్లలకు సరైన సమయాన్ని కేటాయించి గడపలేక పోతున్నారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు నళిని జయ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రాండ్ పేరెంట్స్ పాల్గొన్నారు.

మార్పు కోరుతున్న రాష్ట్ర ప్రజలు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వీఎస్ బోస్

ఉప్పల్: ఉప్పల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి మందుముల పరమేశ్వర్‌రెడ్డికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ గెలుపే ధ్యేయంగా కృషి చేస్తామని భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వీఎస్ బోస్ హామీ ఇచ్చారు. ముమ్మరంగా అభ్యర్థి గెలుపు కోసం ఎన్నికల ప్రచారంలో పాల్గొంటామన్నారు. బుధవారం ఈసీఐఎల్‌లోని నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో సీపీఐ ఉప్పల్ నియోజకవర్గ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.శంకర్ రావు అధ్యక్షతన జరిగిన సమావేశానికి సీపీఐ బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి పరమేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం సీపీఐ, కాంగ్రెస్ శ్రేణులు ఐక్యంగా అభివాదం చేశారు. వీఎస్ బోస్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, ఈ ఎన్నికలు అవినీతికి, అభివృద్ధికి మధ్య జరుగుతున్నట్లు భావించి బుద్ధి చెప్పాలన్నారు. అన్ని వర్గాల ప్రజలు బీఆర్ఎస్‌తో విసుగు చెందారన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి దామోదర్‌రెడ్డి, కె.ధర్మేంద్ర, రాఘవరెడ్డి పాల్గొన్నారు.



ఈసీఐఎల్‌లో అభివాదం చేస్తున్న సీపీఐ, కాంగ్రెస్ శ్రేణులు

మంత్రి మల్లారెడ్డి స్థిర ఆస్తులు రూ.90.24 కోట్లు

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి చామకూర మల్లారెడ్డి స్థిర ఆస్తులు విలువ(భూములు, భవనాల విలువ) రూ.90,24,08,741 ఉన్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో తెలిపారు. ఇందులో ఆయన సతీమణి చామకూర కల్పనా స్థిర ఆస్తుల విలువ రూ.38,69,25,565 పేర్కొన్నారు. తమ స్థిర ఆస్తులు(భూములు, భవనాలు) సూరారం, దూలపల్లి, అలియాబాద్, జీడిమెట్ల, యాదారం, గుండ్లపోచంపల్లి, కండ్లకోయ ప్రాంతాల్లో ఉన్నట్లు మంత్రి మల్లారెడ్డి తెలిపారు. అలాగే, వివిధ బ్యాంకుల్లో తీసుకున్న అప్పులు(లోన్లు) రూ.7,39,94,301 కాగా, ఇందులో ఆయన సతీమణి కల్పనా పేరుతో ఉన్న అప్పులను రూ.4,48,95,098 తెలిపారు. అలాగే, చరా ఆస్తులు(వివిధ బ్యాంకుల్లో నగదు డిపాజిట్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు) రూ.5,70,64,666 ఉన్నట్లు పేర్కొన్న మంత్రి మల్లారెడ్డి, ఇందులో సతీమణి కల్పనకు సంబంధించివి రూ.72,39,185గా తెలిపారు. వాహనాలకు సంబంధించిన వివరాలతోపాటు చేతిలో నగదు ఉన్నట్లు గానీ ఎన్నికల అఫిడవిట్‌లో ఆయన పేర్కొనలేదు.

2018 ఎన్నికల అఫిడవిట్‌లో ఇలా..

2018 సంవత్సరంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సీహెచ్.మల్లారెడ్డి ఎన్నికల అఫిడవిట్‌లో స్థిర ఆస్తులు విలువ రూ.49,26,79,933 చూపించారు. అలాగే, 2014లో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎన్నికల అఫిడవిట్‌లో మల్లారెడ్డి తన స్థిర ఆస్తుల విలువ రూ.48,85,25,332 గా పేర్కొన్నారు.

నందికంటి శ్రీధర్‌తోనే ఉంటాం..

బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ శ్రేణులు



మర్రి రాజశేఖర్‌రెడ్డి, నందికంటి శ్రీధర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరికలు

అల్వాల్: ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ నందికంటి శ్రీధర్‌తోనే బీఆర్ఎస్‌లో కొనసాగుతామని పలువురు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తెలిపారు. బుధవారం జరిగిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నందికంటి శ్రీధర్, మర్రి రాజశేఖర్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో జితేందర్ ముదిరాజ్, రవి ముదిరాజ్, భాస్కర్ యాదవ్, దుర్గేష్, సతీష్ యాదవ్, రవి ముదిరాజ్, మనోజ్‌కుమార్ ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తామంతా నందికంటి శ్రీధర్ నాయకత్వంలో 20 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నాం అన్నారు. ఇప్పుడు కూడా శ్రీధర్ నాయకత్వంలో పనిచేస్తూ మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు.

నోడల్ అధికారులు సమన్వయంతో పనిచేయాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: సాధారణ ఎన్నికల నియమావళిలో బాగంగా గా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో నోడల్ అధికారులు సమన్వయంతో తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి ఎన్నికల వ్యయం, ఎక్సైజ్, జీఎస్టీ, ఎంసీసీ, నోడల్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. శాసనసభ సాధారణ ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించిన అంశాలపై నోడల్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఎన్నికల విధులు ఎంతో కీలకమైనవని, ఎక్కడా ఏ చిన్న పొరపాటు జరగకుండా అన్ని జాగ్రత్తలతో సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలకు గురి కావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే విధంగా నగదు, మద్యం, పంపిణీపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, ఇతర వస్తువుల సీజ్ చేసిన సందర్భాల్లో అన్ని బృందాలు సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో సీజ్ చేసే నగదు, బంగారం, మద్యం, ఇతర విలువైన అభరణాల విషయంలో నోడల్ అధికారులు మరింత సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. సమావేశంలో నోడల్ అధికారులు డీసీవో శ్రీనివాస మూర్తి, డీటీవో నర్సింహ, ఎక్సైజ్ సూపరింటెండెంట్లు అరుణ్ కుమార్, విజయభాస్కర్, జీఎస్టీ అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

సీఈఐఆర్ టెక్నాలజీతో 20 సెల్‌ఫోన్లు గుర్తింపు



బాధితులకు సెల్‌ఫోన్లు అందజేస్తున్న కుషాయిగూడ ఏసీపీ రవీందర్ తదితరులు

కుషాయిగూడ: కొత్తగా అందుబాటులోకి వచ్చిన సెంట్రల్ ఇక్విప్‌మెంట్ ఐడెంటీ రిజిస్టర్ (సీఈఐఆర్) టెక్నాలజీతో పోగొట్టుకున్న 20 సెల్‌ఫోన్లను గుర్తించిన కుషాయిగూడ క్రైం పోలీసులు బుధవారం బాధితులకు అందజేశారు. వీటి విలువ సుమారు రూ.3 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. కుషాయిగూడ ఏసీపీ రవీందర్ చేతులమీదుగా సెల్‌ఫోన్లను అందజేశారు. సెల్‌ఫోన్లను గుర్తించడంలో చాకచక్యంగా విధులు నిర్వహించిన కుషాయిగూడ క్రైం సిబ్బందిని ఏసీపీ అభినందించారు. సెల్‌ఫోన్లు పోయిన బాధితులు తగిన పత్రాలు సమర్పించి సకాలంలో పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, క్రైం ఇన్‌స్పెక్టర్ బి.సాయిప్రకాశ్‌గౌడ్ పాల్గొన్నారు.

దుస్తులు, పండ్ల పంపిణీ



అల్వాల్: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని స్త్రీశక్తి ఫౌండేషన్ చైర్మన్ రాజేంద్రకుమార్ బుధవారం శ్రీషిరిడీ సాయి ఓల్డ్ ఏజ్ హోమ్‌లో వృద్ధులైన స్త్రీ, పురుషులకు దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు.